క్లుప్తంగా

కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా గిరిబాబు



గిరిబాబుకు నియామకపత్రం అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు యోగానందచారి

అర్వపల్లి: కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామానికి చెందిన బొర్ర గిరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక కాపీని అర్వపల్లిలో సోమవారం గిరిబాబుకు డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కె. అవిలయ్య, మేకల రాంబాబు, ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకురాలి మృతి



రామన్నగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి: మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు తవిటి బుచ్చమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. జెడ్పీటీసీ దావుల వీర ప్రసాద్‌యాదవ్ ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పొట్టిపాక సైదులు, కర్నాటి మురళి, రేఖల సైదులు, తవిటి సైదులు, నరేష్, తనీష్ తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



కొమ్మాలలో ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి: మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన సూరారపు మహేశ్వరి ప్రసవించిన మరుసటి రోజు అకాల మరణం చెందారు. దీంతో ఆమె కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం, బియ్యం అందజేశారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన అల్లి భారతమ్మ ఇటీవల మృతి చెందారు.ఆమె కుటుంబానికి క్వింటా బియ్యం అందించారు. కార్యక్రమంలో జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, నాయకులు మండడి పూర్ణచంద్రారెడ్డి, సైదులు, కుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, గంగదెరి శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, వెంకటాద్రి, ఉదయ్, మల్లయ్య, సైదులు, కృష్ణ, ప్రభాకర్, వెంకటయ్య, సైదులు, విఠల్, రాకేష్, లాలు, హరీష్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : మండల పరిధిలోని ముకుందాపురం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి దిర్శనపల్లి సబ్‌స్టేషన్ వరకు 33 కేవీ ఇంటర్ లింకు వేసే క్రమంలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి ఉదయం 11గంటల వరకు 11కేవీ చిన్ననెమిలా ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సురేందర్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాంసం విక్రయదారులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మాంసం విక్రయదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణదారులు మాంసం వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేయాలన్నారు. ఆరోగ్యకరమైన కోళ్లు, మేకల మాంసాన్ని విక్రయించాలని, మాంసం దుకాణ పరిసరాలను బ్లీచింగ్ పౌండర్‌తో శుభ్రపరచాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జవాన్ జానీ, సైదా, బాలరాజు, లింగయ్య, అంజయ్య, కృష్ణ ఉన్నారు.

సర్కారు బడికి సొబగులు

- ప్రత్యేక నిధులతో పాఠశాలల అభివృద్ధి
- అమ్మ ఆదర్శ కమిటీలతో మౌలిక సదుపాయాల కల్పన
- విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి

పెన్‌పహాడ్: గ్రామీణ ప్రాంతాల పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా సర్కారు బడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతోంది. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపక్రమించింది. ప్రస్తుతం పాఠశాలల అభివృద్ధికి మహిళా సంఘాల ప్రతినిధులకు ప్రాధాన్యత కల్పిస్తూ సంఘం గ్రామ అధ్యక్షురాలిని పాఠశాలకు చైర్‌పర్సన్‌గా నియమించారు. కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయురాలు, మహిళా సంఘాల సీసీలుగా ఇంచార్జిగా వ్యవహరించడంతో పాటు అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు.

రూ 41.95లక్షలు మంజూరు

ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మండలంలోని 32బడులకు గాను రూ.15 లక్షలు కేటాయించారు. 8బడులకు రూ. 2లక్షలు చెల్లించారు. పనుల నిర్వహణకు ముందస్తుగా కమిటీలకు మంజూరైన నిధులలో ఒక్కో పాఠశాలకు 25శాతం నిధులు చెల్లించి పనులు చేయిస్తున్నారు.



పెన్‌పహాడ్ మండలం దుబ్బతండా ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన తాగునీటి ట్యాంక్



దుబ్బతండా ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు

సౌకర్యాలకు ప్రాధాన్యత

సౌకర్యాల కల్పనలో భాగంగా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్‌సౌకర్యం, భవనాల మరమ్మతులు తదితర వాటికి ప్రాధాన్యత నిస్తూ పనులు చేస్తున్నారు ఇప్పటి వరకు 75శాతం పనులు పూర్తయినట్లు సమాచారం. చిన్నారులకు ఉపయోగకరం: ఎస్ పద్మ అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ దుబ్బతండా పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వలన మా ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగం కానుంది. అన్ని సౌకర్యాలు ఉండి ఆహ్లాదకరమైనా వాతావరణంలో ఉన్న పాఠశాలల్లో వారి వారి పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపే అవకాశం ఉంది.

'కార్పొరేట్'కు దీటుగా..



కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామాల్లోని సర్కారు బడులను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో బడుల్లో వసతుల కల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి వందశాతం పనులను పూర్తి చేస్తాం. సరికొత్త సొబగులతో విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్ తెలిపారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నాలుగు గ్రూపులుగా ఏర్పడి సోమవారం బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. విద్యార్థులలో సామర్థ్యాలను వెలికి తీసి నాణ్యమైన బోధన అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, జానయ్య, ఉపేంద్ర, సత్తిరెడ్డి, వెంకన్న, రవీందర్ తదితరులున్నారు.



బడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎరువులు, విత్తనాల దుకాణాల తనిఖీ



తిరుమలగిరిలో ఎరువుల దుకాణాలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.కె.గౌస్, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డీలర్లు తప్పని సరిగా టాస్క్‌ఫోర్స్, ధరల పట్టికలు కనపడేటట్లు ఉంచాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, స్టాక్ రిజిస్టర్లు తప్పని సరిగా అప్‌డేట్‌చేయాలన్నారు. విత్తనాల ధరలను ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మరాదన్నారు. పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించ వద్దని డీలర్లను హెచ్చరించారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో యూనిఫాంలు విక్రయించొద్దు

సూర్యాపేట : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో యూనిఫాం, షూ, బుక్స్ వంటివి అమ్మకాలు చేయవద్దని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి కోరారు. యూనిఫాం, షూస్, బెల్ట్, స్టేషనరీ, పుస్తకాలు వంటివి అమ్మడం నిషేధించాలని, అధిక ఫీజు దోపిడీని అరికట్టాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరిండెంటెండ్ శ్రావణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులను వసూలు చేస్తూ పిల్లల తల్లిదండ్రుల నుంచి పుస్తకాలు, టై, బెల్ట్, షూ పేర్లతో ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పాఠ్యపుస్తకాలు అమ్మడం నేరమని ప్రభుత్వం నుంచి సర్క్యులర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడమర్తి భరత్, ఎస్ కె రహీం , లింగన్న పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నూతనకల్: మండల పరిధిలోని గుండ్లసింగారంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవ రెడ్డి మామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూరెడ్డి పుల్లారెడ్డి ఇటీవల మృతి చెందాడు. సోమవారం మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి, ఎంపీటీసీ సజ్జనాయక్, మాజీ సర్పంచ్ కరుణశ్రీగిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు లేక ఇక్కట్లు

- తండాల్లో ఏర్పాటు కాని రేషన్ దుకాణాలు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- ఏళ్లుగా పట్టించుకోని పాలకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా మారినా ఆయా తండాల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయలేదు. పంచాయతీలుగా మారి ఏళ్లు గడుస్తున్నా చౌక ధరల దుకాణాలను ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. 500 జనాభా దాటిన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారు. కానీ ఆయా తండాల్లో మౌలిక వసతులు, రేషన్ షాపుల ఏర్పాటు తదితర సౌకర్యాలు మరిచారని గిరిజనులు వాపోతున్నారు.

2018 సంవత్సరంలోనే జీపీలుగా..

గత ప్రభుత్వం 500 జనాభా దాటిన తండాలను పంచాయతీలుగా మార్చింది. 2018 ఆగస్టులో తండాలు పంచాయతీలుగా ఏర్పాటు కాగా 2019 జనవరిలో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అనంతరం ఫిబ్రవరిలో సర్పంచ్‌లుగా ప్రమాణ స్వీకారం చేశారు. తండాల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులు పక్క గ్రామాలకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. పాత గ్రామ పంచాయతీల్లోనే రేషన్ షాపులు ఉండటంతో అక్కడికే వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ సరుకులు, ఆసరా పింఛన్లు తదితరాలకు పాత గ్రామ పంచాయతీలకే వెళ్లాల్సి రావడంతో తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చినా ఏం ప్రయోజనం కలిగిందని గ్రామస్తులు వాపోతున్నారు. తిరుమలగిరి మండలంలో నూతనంగా 9 తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. ప్రస్తుతం ఈ తండా వాసులు పాత గ్రామాలకే వెళ్లి సరుకులు, పింఛన్లు తీసుకొని వస్తున్నారు.



చింతలకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం

నూతన ప్రభుత్వంలో ఏర్పాటయ్యేనా?

గత ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చింది. మరో రెండు, మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి నూతన ప్రభుత్వం సూచిస్తుండటంతో దాని కంటే ముందే ఆయా తండాల్లో రేషన్ షాపులను ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. తండాలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయడం ద్వారా డీలర్‌తో పాటు గుమస్తా పేరిట ఉపాధి అవకాశాలు లభిస్తాయని పలువురు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



తండాలో రేషన్ దుకాణం లేకపోవడంతో ప్రతి నెలా మూడు కిలో మీటర్లు వెళ్లి సరుకులు తీసుక రావాల్సి వస్తుంది. గ్రామాల్లోని ఆసరా పింఛన్‌దారులు కూడా పాత గ్రామ పంచాయతీలకు వెళ్లి పింఛన్లు తీసుకొని రావాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి తండాల్లోనే రేషన్ షాపులు ఏర్పాటు చేయాలి.

– గుగులోతు పద్మ, జేత్యా తండా

చిరు జల్లులకే చిత్తడిగా..

అర్వపల్లి: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది చిరు జల్లులకే అర్వపల్లితోపాటు మండల వ్యాప్తంగా వీధులు బురద మడుగులుగా మారాయి. అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ఎదుట వర్షపు నీరు చేరి చిత్తడిగా మారింది. అలాగే దేవాలయం ఆవరణలో కూడా నీళ్లు చేరి నీటి మడుగులా మారాయి. మండలంలోని పలు గ్రామాలలో వర్షానికి వీధులలో నీరు చేరి బురద మడుగులను తలపించాయి. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో ఇళ్ల కప్పులైన రేకులు లేచిపడ్డాయి. మామిడి, నిమ్మతోటలలో కాయలు రాలిపోయాయి.



అర్వపల్లి ఆలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

సమస్యలపై రాజీలేని పోరాటం

నేరేడుచర్ల : మహిళా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసేది మహిళా సమాఖ్య మాత్రమేనని ఆ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి అన్నారు. సోమవారం నేరేడుచర్లలో జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో మహిళల కోసం ఒక సంఘం ఉండాలని, ఆనాటి ప్రముఖ మహిళా కమ్యూనిస్ట్ యోధురాలు స్థాపించిన సంఘమే మహిళా సమాఖ్య అని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలలని సమాఖ్య ఉద్యమిస్తుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లను పర్మినెంటు చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకురాళ్లు నాగలక్ష్మి, సత్యవతి, శ్రావణి, సైదమ్మ, అరుణ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం

తుంగతుర్తి : రైతులకు కల్తీ విత్తనాలు, నిషేధిత క్రిమిసంహారక మందులు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ హెచ్చరించారు. సోమవారం ఎరువులు, విత్తనాల షాపు యజమానులతో స్థానిక పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఎవరైనా నకిలీ పత్తి, కంది, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలకు సంబంధించిన నాసిరకం విత్తనాలను విక్రయించరాదన్నారు. నిషేధిత క్రిమిసంహారక మందులు విత్తనాలు రైతులకు ఇవ్వరాదని హెచ్చరించారు. షాపులో నిల్వకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరారు. నకిలీ విత్తనాలను విక్రయించే వ్యాపారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనధికారికంగా విత్తనాలు అమ్మితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్సై ఏడుకొండలు, వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మీప్రసన్న, విత్తనాల ఎరువుల షాపుల డీలర్ల అధ్యక్షుడు పూసపల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో విత్తన డీలర్లతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

మార్క్సిజమే ప్రపంచానికి మార్గదర్శి

- సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్

భానుపురి (సూర్యాపేట) : సమాజంలో అసమానతలు తొలగి, సమసమాజం నిర్మాణం జరగాలంటే మార్క్సిజమే ప్రపంచానికి మార్గదర్శి అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ రామచందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతుల రెండోరోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో వర్గ పోరాటంతో పాటు కులవర్గ పోరాటాలు అనేక వేల సంవత్సరాల నుంచి ప్రజల మధ్య అంతరాలను పెంచుతుందన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు స్వరూప, శిరోమణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఝాన్సీ, మాజీ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, కొత్తపల్లి రేణుక, లక్ష్మీ, లలిత, కకల్పన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేజీ రాంచందర్

ఘనంగా గంగాదేవమ్మ, లింగమంతుల స్వామి జాతర

సూర్యాపేట : మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామంలో సోమవారం గంగా దేవమ్మ, లింగమంతుల స్వామి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డిలు మాట్లాడుతూ మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జాతరలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో అభివృద్ధి చెందాలని ఆ భగవంతుడుని కోరుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎడ్ల గంగాభవాని, వీరమల్లుయాదవ్, ఎల్గురి వీరయ్యగౌడ్, యలగబోయిన మధుయాదవ్, కొప్పుల రాంరెడ్డి, ఎడ్ల ఉపేందర్, ఎడ్ల వెంకన్న పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులో వెలిసిన చౌడమ్మ తల్లి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతరకు గ్రామం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు వండుకుని గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం యాపోతులు, కోళ్లు, బలిచ్చి ఇష్ట దైవాన్ని కోలుచుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములపల్లి వాసుదేవరావు, యల్కపల్లి వెంకన్న, జంపాల అంజయ్య, గోగుల ఈదయ్య, వీరబోయిన సైదులు యాదవ్, యల్కపల్లి సైదులు శ్రీనివాస్, మట్టపల్లి సైదులు, పాల్గొన్నారు.



సూర్యాపేట మండలం రాయినిగూడెంలో పూజల్లో పాల్గొన్న రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

నాగులపాటి అన్నారంలో..

పెన్‌పహాడ్ : శ్రీ సౌడమ్మ–లింగమంతుల జాతర ఉత్సవాలు సోమవారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ లింగమంతుల–సౌడమ్మ విగ్రహాలను అందంగా అలంకరించారు. జాతర ఉత్సవాలను మండలంలోని పలు గ్రామాలతో పాటు ఇతర మండలాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కలను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్నా భిక్షం, మున్నా శేఖర్, వీరబోయిన రవి, నాగయ్య, సైదులు, సౌడయ్య, పేర్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

7న ఆలయ భూముల వేలం

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ భూములకు ఈ నెల–7న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2024–2025 సంవత్సరానికి గాను ఈనెల–7వ తేదిన సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో దేవాలయ భూములను కౌలు కోసం వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే రైతులు రూ.10,000 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

పెన్‌పహాడ్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందింకోవాలని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల నాగులపాటి అన్నారం గ్రామంలోని శ్రీ లింగమంతుల–సౌడమ్మ స్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిభావం పెంపొందడం వలన మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా భేరి వాయిస్తూ యాదవ నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, ముత్తినేని శ్రీనివాస్, నకిరేకంటి వెంకన్న, సౌడయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అందరి బాధ్యత

మునగాల : ప్రకృతి వ్యవసాయం అందరి బాధ్యత అని నడిగూడేనికి చెందిన సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపయ్య తెలిపారు. సోమవారం మునగాల మండల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఖరీఫ్ సీజన్ నుంచి ప్రతి రైతు కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ఎలాంటి రసాయన మందులు వాడకుండా సహజసిద్ధ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. భూసారం పెరగాలంటే పశువుల పెంట, చెరువు మట్టి వాడాలని, జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేయాలని, జీవామృతం, ఘన జీవామృతం ఉపయోగించాలన్నారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు వేపగింజలు, వేపాకు, వావిలాకు, తూడికాడ ఆకుల ద్రావణాలు, ఆవు మూత్రం, ఇంగువ, పుల్లటి మజ్జిగ ద్రావణాలు పిచికారీ చేసి సమర్ధవంతంగా నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాలబిందెల నాగయ్య, పాలబిందెల కిరణ్, వేట అశోక్, గడ్డం వినోద్, మండవ లక్ష్మయ్య పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీటీసీఎస్

నూతనకల్ : మండల పరిధిలోని యడవెల్లి గ్రామ రేషన్ దుకాణాన్ని డీటీసీఎస్ విజయశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. దుకాణంలోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ లబ్దిదారులకు సకాలంలో బియ్యం పంపిణీ చేయడం లేదని ఆందోళన చేసిన విషయమై దుకాణాన్ని తనిఖీ చేయడంతో పాటు గ్రామస్తులతో చర్చించినట్లు ఆయన తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో మూగజీవాల మృత్యువాత

- వాహనాల అతివేగమే ప్రమాదాలకు కారణం
- రెండు నెలల వ్యవధిలో 40కి పైగానే మూగజీవాల మృతి
- సుమారు రూ.14 లక్షల వరకు నష్టం

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులపై వాహనాల అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రెండు నెలల వ్యవధిలో 40 మూగజీవాలకు పైగానే మృత్యువాత పడ్డాయి. అయితే ఎక్కువగా నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారిపై వంగమర్తి నుంచి జాజిరెడ్డిగూడెం వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పది రోజుల వ్యవధిలో 18 వరకు గేదెలు ఇతర మూగజీవాలు మరణించాయి. రెండు నెలల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో రైతులకు సుమారు రూ. 14 లక్షల వరకు నష్టం వాటిల్లింది. పశువులు, జీవాలు మేతకు వెళ్లి తిరిగి సాయంత్రం, రాత్రి వేళల్లో ఇంటికి వచ్చే సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాడి రైతులు గేదెలను పోగొట్టుకొని ఇబ్బందులు పడుతున్నారు. కాగా గుర్తు తెలియని వాహనాలు ఢీకొనడంతో కేసులు కూడా పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. వాహనాలను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం మూలంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



జాజిరెడ్డిగూడెం శివారులో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందిన గేదె (ఫైల్)

నిత్యం ప్రమాదాలు

సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులపై మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిత్యం ఏదో ఒక చోట వాహనాలు ఢీకొని గేదెలు, ఇతర మూగజీవాలు చనిపోతున్నాయి. జాజిరెడ్డిగూడెంలో ఇప్పటికే 12 మందికి పైగా రైతుల పాడిగేదెలు ప్రమాదాల్లో చనిపోయాయి. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సంబంధిత పోలీస్ శాఖ, హైవే విభాగం అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు, పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు కోరుతున్నారు.

రెండు గేదెలు చనిపోయాయి



జాజిరెడ్డిగూడెం శివారులో ఇటీవల గుర్తుతెలియని వాహనం ఢీకొని నా రెండు గేదెలు చనిపోయాయి. ఈ ప్రమాదంలో రూ .1లక్ష వరకు నష్టం జరిగింది. సాయం కోసం ఎవరికి చెప్పుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

– బట్టమేకల రాంమ్మల్లు, రైతు, జాజిరెడ్డిగూడెం

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



జాజిరెడ్డిగూడెం శివారులో నిత్యం ఏదో ఒకచోట వాహనాలు ఢీకొని పశువులు చనిపోతున్నాయి. వాహనాలు అతివేగంగా వస్తుండటంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

– నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ